## నాలుగు వాలంటీర్ల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం



**ఉలవపాడు రూరల్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త** మండలంలో ఖాళీగా ఉన్న 15వ విడత 4 వాలంటీర్ల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల ఎంపీడీఓ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణాపురం -1, కరేడు(2)-1, కరేడు(3)-1, పెద్దపుట్టపుపాలెం -1 చొప్పున మొత్తం నాలుగు వాలంటీర్ల పోస్టులు ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. వయస్సు 18 నుంచి 35 సంవత్సరాలు ఉండాలన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. అర్హులైన అభ్యర్ధులు ఈనెల 1వ తేదీ నుండి 5వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. 6న దరఖాస్తుల పరిశీలన, 7 నుంచి 8వ తేదీ వరకు ఇంటర్వ్యూల నిర్వహణ, ఎంపిక ప్రక్రియ, 9న నియామక పత్రాలు అందజేయడం జరుగుతుందని తెలియజేశారు.

## 3న అంగన్‌వాడీ ఇంటర్వ్యూలు

**చేజర్ల, సెప్టెంబర్1,ప్రభాతవార్త:** పొదలకూరు ప్రాజెక్ట్ పరిధిలోని చేజర్ల మండలంలో ఖాళీగా ఉన్న అంగన్ వాడీ కార్యకర్త, ఆయా ల పోస్టులకు ఈనెల 3న ఆత్మకూరు ఆర్‌డిఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరగనున్నాయని ఇన్‌చార్జ్ సిడిపిఓ మురగళ్ళఅన్నపూర్ణ తెలిపారు. నాగులవెల టూరు హెచ్‌డబ్ల్యు ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, కాకివాయి, బొగ్గులవారికండ్రిక, మాముడూరు-2లలో ఖాళీగా ఉన్న ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఇంటర్వ్యూకు విద్యార్హతలు, పుట్టి నతేదీ ధృవీకరణ పత్రం , తహసిల్దార్‌చే జారీ చేయబడ్డ కులం, నివాస ధృవీకరణ పత్రం, ఇంటర్వ్యూ కాల్‌లెటర్, ఇతర అర్హతలకు సంబం ధించిన సర్టిఫికేట్లు, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తు , రశీదులను తమ వెంట తీసుకురావాలని ఆమె సూచించారు.

## ఘనంగా వినాయకచవితి వేడుకలు

చేజర్ల,సెప్టెంబర్1,ప్రభాతవార్త: చేజర్ల మండలంలో వినాయకచవితి వేడుకలు ఘనంగా జరిగాయి. మండలంలోని అన్ని గ్రామాల్లోను యువత పోటాపోటీగా ఈ ఏడాది గణనాథుని ఉత్సవాలను నిర్వహించారు. గ్రామాల్లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు వర్క్ ఫ్రం హోమ్ చేస్తూ అందుబాటులో ఉండడం వలన ఎక్కువ గ్రామాల్లో వారి ఆధ్వర్యంలోనే ఈ ఉత్సవాలు జరిగాయి. అన్నదానాలు , సాంస్కృతిక కార్యక్రమాలు డిజె , తప్పెట వాయిద్యాలు, పోటాపోటీగా నిర్వహించడంతోపాటు వినాయకుని లడ్డు విక్రయాల్లోను పోటాపోటీగా వేలంలో దక్కించుకున్నారు. కొన్ని గ్రామాల్లో శుక్రవారం 3వరోజు కావడంతో గురువారం సాయంత్రమే వినాయక నిమజ్జనం చేశారు. గత రెండేళ్ళుగా కరోనాకారణంగా వినాయకచవితి వేడుకలు నిర్వహించకపోవడంతో ఈ ఏడాది అన్ని గ్రామాల్లోను , అన్ని వీధుల్లోను అన్నదానాలు , భజనలు , కోలాటాలు నిర్వహించారు . బుధవారం ఉదయం వినాయకుని ప్రతిష్టించిన అనంతరం పూజలు నిర్వహించి స్వామివారికి ఉండ్రాళ్ళు, పూర్ణాలు, రకరకాల పిండివంటలతో నైవేధ్యాలు సమర్పించారు. మరికొన్ని గ్రామాల్లో మూడురోజులపాటు మూడుపూటలా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. రెండేళ్ళుగా సాంస్కృతిక కార్యక్రమాలు లేకపోవడం, ఉత్సవాలు లేకపోవడంతో యువత ఒకరిపై ఒకరు రంగులు పూసుకుంటూ ఉట్టిమహోత్సవాన్ని నిర్వహించి ఘనంగా ఊరేగించారు. గురువారం సాయంత్రం సమీపంలోని చెరువులు, డ్యామ్‌ల వద్ద నిమజ్జనం చేశారు.

## పిఎం కిసాన్ గడువు పొడిగింపు

**చేజర్ల,సెప్టెంబర్1,ప్రభాతవార్త:** మండలంలోని రైతులు ప్రధానమంత్రి కిసాన్‌యోజన పథకం కింద దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 9వరకు గడువు పొడిగించారని వ్యవసాయాధికారి వి.శశిధర్ పేర్కొన్నారు. పిఎం కిసాన్ నిధులు పొందాలంటే తప్పనిసరిగా ఆర్‌బికెల వద్ద కానీ, సిఎస్‌సి సెంటర్ల వద్ద కానీ ఇకెవైసి తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. అలాగే ప్రస్తుతం పంటలు వేస్తున్న, వేసిన రైతులందరూ తప్పనిసరిగా ఈ-క్రాప్‌ను చేయించుకోవాలని ఆయన తెలిపారు.

## రోడ్డుపై ఉన్న చెట్టును తొలగించిన పోలీసులు

**వలేటివారిపాలెం సెప్టెంబరు 1, ప్రభాతవార్త,** మండలంలోని చుండి గ్రామసమీపాన జాతీయరహదారి పక్కన గల చెట్టు విరిగి రోడ్డుపై బుధవారం పడింది.దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.ఈ విషయం గమనించిన వలేటివారిపాలెం ఎస్సై సుదర్శన్ ఆధ్వర్యంలో వీవీపాలెం పోలీసులు రమేష్, శ్రీనివాసులు తదితరులు సహకారంతో పొక్లెయినర్ ఉపయోగించి రోడ్డుపై పడిన చెట్టును తొలగించారు. దీంతో వాహనాలకు ఎటువంటి ఇబ్బంది కలగలేదు.ఈ విషయంలో సకాలంలో స్పందించిన పోలీసులును వాహనచోదకులుతోపాటు పలువురు ప్రయాణికులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఇంటర్‌లో ప్రధమస్ధానంలో శరణ్య



**వలేటివారిపాలెం సెప్టెంబరు 1, ప్రభాతవార్త,** కందుకూరు పట్టణానికి చెందిన కొచ్చెర్ల శరణ్య ఇంటర్ పరీక్షా ఫలితాల్లో జిల్లా స్ధాయిలో ప్రధమ స్ధానంలో నిలిచింది. ఎంపీసీ విభాగంలో 470మార్కులకు 466మార్కులు సాధించింది.ఈమె పట్టణంలోని బీఆర్ ఆక్స్‌ఫరడ్ కాలేజిలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతుంది.మార్చి-2022లో జరిగిన పరీక్షల్లో ఈమెకు ఇంగ్లీషులో 94 మార్కులుతో మొత్తం 464మార్కులు వచ్చాయి. ఇంకా ఎక్కువ మార్కులు నిమిత్తం ఆమె మరలా ఇంగ్లీషులో సప్లమెంటరీ పరీక్షకు హాజరయ్యారు.దీంతో మరో 3మార్కులు అదనంగా సాదించింది. మొత్తం 470మార్కులకు గానూ 466మార్కులు సాదించి జిల్లాస్ధాయిలో ప్రధమస్ధానంలో నిలిచింది.దీంతో కాలేజి యాజమాన్యంతోపాటు పలువురు విద్యావేత్తలు విద్యార్ధి శరణ్యను అభినందించారు.శరణ్య తండ్రి విద్యాశాఖలో సీఆర్‌పీ పనిచేయడం గమనార్హం.

## జగనన్న శాశ్వతభూహక్కు భూసర్వే కార్యక్రమం ప్రారంభం



**వలేటివారిపాలెం ఆగస్టు సెప్టెంబరు 1,ప్రభాతవార్త,** మండలంలోని పోలినేనిపాలెం, కలవళ్ల గ్రామాల్లో రెండో విడత జగనన న్నశాశ్వత భూహక్కు,భూరక్ష పథకం స్వామిత్వలోభాగంగా గురవారం భూసర్వేకు శ్రీకారం చుట్టారు.డ్రోన్ కెమెరాల ద్వారా అత్యాధునిక టెక్నాలజీని వినియోగించి భూముల సర్వేచేయడం రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పోలినేనిపాలెం సర్పంచ్ అమరేశ్వరి, ఎంపీటీసీ రవీంద్రలు అన్నారు.కలవళ్లలో జరిగిన కార్యక్రమంలో ఆర్డీవో సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర వ హించాలని రెవిన్యూ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో స్ధానిక తహసిల్దార్ సుందరమ్మ,ఎంపీడీవో రఫీక్ అహ్మద్, ఆర్.ఐ నరసయ్య,డివిజనల్ సర్వేయర్ ముసలయ్య, మండల సర్వేయర్ శ్రీలక్ష్మి, ఈవోఆర్డీ సుమంత్,పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## వాలంటీర్లకు 7న ఇంటర్వ్యూలు

**వలేటివారిపాలెం ఆగస్టు సెప్టెంబరు 1, ప్రభాతవార్త,** మండలంలోని శింగమనేనిపల్లె, లింగపాలెం గ్రామాల్లో ఒక్కొక్క గ్రామంలో ఒకటి చొప్పున 2 వాలంటీర్లు పోస్టులు ఖాళీగా ఉన్నాయి.సేవాభావమే ప్రామాణికంగా 10వ తరగతి లేదా ఇంటర్ విద్యార్హతలు స్ధానికులు ఈ నెల 5లోపు ఆన్‌లైన్‌లో ధరఖాస్తుచేసి హార్డుకాపీలతో ఈనెల 7న ఇంటర్వ్యూలుకు హాజరుకావాలని ఎంపీడీవో రఫీక్ అహ్మద్ తెలిపారు.

## గౌరి గణపతి విగ్రహానికి ప్రత్యేక పూజలు

**కలువాయి సెప్టెంబర్ 1 ప్రభాతవార్త** ప్రధమగణాధిపాతి..... ఆదిదేవునికి భక్తులు అడుగడుగన .... వేడుకలను వైభవంగా నిర్వహించారు. వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని అన్ని ప్రాంతాలలో వేడుకలను నిర్వహించారు.ముందుగా వినాయకునికి ప్రత్యేక మండపాలు వేసి విశేష అలకంరణతో స్వామి వారిని అలంకరించి పండితులు వినాయ వ్రత పూజలు నిర్వహించారు.భక్తులు ఇంటి నుండి ప్రత్యేకంగా ప్రసాదాలు,పిండి పదార్ధాలను స్వామి వారికి నైవేద్యంగా సమర్పించారు.ఇందులో భాగంగా కలువాయిలోని పునగాని వారి వీధిలో ఏర్పాటు చేసిన గౌరి గణపతి గ్రామస్తులను ప్రత్యేకంగా ఆకట్టుకుంది. ఆప్రాంతానికి చెందిన ఉయ్యాల సుబ్బారావు ప్రత్యేక అలంకరణలో ఉన్న వినాయకుడ్ని అందించారు.

## పేకాట శిబిరంపై పోలీసులు దాడి

**లింగసముద్రం, సెప్టెంబరు 1, ప్రభాతవార్త** మండలంలోని జంపాలవారిపాలెం గ్రామంలో పేకాట శిబిరంపై ఎస్సై వెంకటేశ్వర్లు తన సిబ్బందితో దాడి చేసి పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. గురువారం అందిన సమాచారం మేరకు పేకాట నిర్వహకుల నుంచి రూ.3వేల వరకు నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిజేశారు.

# ఇద్దరు చిన్నారులతో కలిసి ఆత్మహత్య







**వింజమూరు,సెప్టెంబర్1,ప్రభాతవార్త:** వింజమూరు పంచాయతీ పరిధిలోని జైభీం నగర్‌లో నివాసముంటున్న ఒక వివాహిత తన ఇద్దరు పిల్లలతో కలిసి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సంచలంగా మారింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు సాదం వెంకట్రావ్ సుమారు 12సంవత్సరాల క్రితం చెర్లోయడవల్లికి చెందిన డోలా నర్సింహులు-నరస్వతిల చిన్న కుమార్తెను డోలా గీత ను వివాహం చేశారు. కొద్దిరోజులు సజావుగా సాగిన వారి సంసారం చిన్నపాటి మనస్పర్ధలతో గత కొన్ని నెలలుగా కాపురంలో ఒడిదుడుకులు ఉండడంతో గీత అన్నదమ్ములు, బంధువులు సర్ధిచెప్పి సంసారం చేసుకోమన్నారు. కాగా గత నెలలో కూడా గీత తన కుటుంబ సభ్యులకు తాను ఇక్కడ ఇబ్బందులు పడుతున్నానని తెలపడంతో తన అన్న త్వరలో వచ్చి సమస్యను పరిష్కరిస్తానని చెప్పాడన్నారు. ఈనేపథ్యంలో గురువారం భర్త వెంకట్రావ్ గ్యాస్ ఏజెన్సీలో ఉద్యోగానికి పోగా మధ్యాహ్నం భోజనానికి ఇంటికి రావడంతో ఇంట్లో దేంతులకు చీరతో పిల్లలు, తాను ఉరేసుకొని మృతిచెందారు. ఈఘటనను చూసిన భర్త కేకలు వేయడంతో చుట్టుప్రక్కల వారు వచ్చి మృతిచెందిన వారిని కిందికి దించి చూడగా అప్పటికే ప్రాణాలు గాలిలో కలిసిపోయాయని తెలిపారు.దాంతో చుట్టుప్రక్కల నివాసాలవారు ఆ తల్లికి ఏం కష్టం వచ్చిందో బిడ్డలతో కలిసి ఆత్మహత్య చేసుకోవాల్సిన అవసరం ఏమొచ్చిందో నని ఆవేదన చెందారు. 9నెలలు తన గర్భంలో దాచుకొని కని పెంచి పెద్దచేసిన బిడ్డలపై మీద ఉన్న ప్రేమానురాగాలను తెంచుకొని ఇద్దరు బిడ్డలతో సహా ఆత్మహత్య చేసుకోవడం దారుణమని గ్రామస్తులు వాపోయారు. గీత (32)కు ఒక కుమారుడు వెంకట్ (10), కుమార్తె చరిష్మ (5)ఈ విషయం తెలుసుకున్న కలిగిరి సిఐ సాంబశివరావ్, ఎస్ఐ జంపాని కుమార్‌లు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని సంఘటన జరిగిన తీరును పరిశీలించి మృతురాలి భర్త వెంకటరమణను విచారించి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసుకున్నారు. అనంతరం సిఐ మాట్లాడుతూ మృతురాలు గీత ఆత్మహత్య చేసుకున్న గల కారణాలపై విచారణ సాగిస్తున్నామని, మృతురాలి తల్లికి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతురాలి భర్త వెంకటరమణను అదుపులోకి తీసుకున్నారు.

# ఉచిత రేషన్ తీసేసి.. పేదల కడుపులు కొట్టొద్దు



**కావలి సెప్టెంబర్ 1 ప్రభాతవార్త** వైసిపి ప్రభుత్వ పాలనలో అర్హులకు రేషన్ ఎగ్గొట్టొద్దని, పేదల కడుపు కొట్టొద్దని, సియం డౌన్‌డౌన్, వైసిపి డౌన్‌డౌన్ అంటూ టిడిపి నేతలు నిరసన నినాదాల ప్రదర్శనతో కూడిన ధర్నా నిర్వహించారు. కావలి తహసీల్దారు కార్యాలయం వద్ద గురువారం టిడిపి కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాలెపాటి సుబ్బానాయుడు నాయకత్వంలో టిడిపి నేతలు భారీస్థాయిలో తరలి వచ్చి ధర్నా కార్యక్ర మం చేపట్టారు. తహసీల్దారుకు వినతిపత్రం అందచేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు గుత్తికొండ కిషోర్‌బాబు, కావలి పట్టణ ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, రూరల్ మండల అధ్యక్షులు ఆవుల రామకృష్ణ, టిడిపి నేతలు బొట్లగుంట శ్రీహరినాయుడు, తటవర్తి వాసు, ఉప్పుటూరి బాలగురుస్వామి, గోళ్ల అమరజ్యోతి, విజయలక్ష్మి, రాధమ్మ, శ్రీదేవి, కాకి ప్రసాద్, దావులూరి దేవకుమార్, పోతుగంటి శ్రీకాంత్, చవల రామకృష్ణ, షేక్.మస్తాన్, మంచాల ప్రసాద్, పులి సుధాకర్, వేటూరి శివ, అక్కిలిగుంట సూర్యప్రకాష్, షేక్.రఫి అహ్మద్, నూతలపాటి శాంతకుమార్, శానంహరి, బూసి రవి, రవిగౌడ్, ఉప్పాల మాలకొండయ్య, పులి రమేష్ యాదవ్, మద్దూరి రవి, అంబటి కిషోర్, సురేంద్ర,వేణు తదితరులు పాల్గొని మాట్లాడారు. జాతీయ ఆహారభద్రత చట్టం 2013 ప్రకారం అర్హులైన పేదలందరికి ఆకలి తీర్చడం ప్రభుత్వాల ధ్యేయమన్నారు. సియం జగన్‌రెడ్డి పాలనలో ఆహార భద్రతచట్టానికి తూట్లుపొడిచారన్నారు. కేంద్రప్రభుత్వ ఆదేశాలను ఈ ప్రభుత్వం బేకారు చేస్తుందన్నారు. ప్రతి రేషన్‌కార్డు దారునికి ఉచిత బియ్యంఅందించాలని డిమాండ్‌చేశారు.లేకుంటే ప్రజాఉద్యమం చేపట్టాల్సి వస్తుందనిహెచ్చరికలు చేశారు

## పర్యావరణాన్ని కాపాడుతున్న అలగానిపాడు యువత



**విడవలూరు సెప్టెంబర్ 1 ప్రభాతవార్త** ప్లాస్టర్‌ప్ ప్యారిస్ విగ్రహాలు ఏర్పాటు చేసి పర్యావరణాన్ని కలుషితం చేస్తున్న రోజులలోపర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా గత మూడు సంవత్సరాల నుండి మట్టి వినాయకుడ్ని ఏర్పాటు చేసి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు అలగానిపాడు యువత.వీవర్స్ కాలనీలో ప్రతి ఏడాది వినాయక చవితి పండుగను ఘనంగా నిర్వహిస్తారు. అందులో భాగంగా వినాయకచవితిని పురస్కరించుకొని 7 అడుగులు మట్టి విగ్రహాన్ని తయారు చేశారు. మట్టి వినాయకుడ్ని ప్రతిష్టించి పూజలు నిర్వహించారు. విగ్రహానికి కెమికల్ రహిత రంగులు వేశారు.భావితరాలకు అలగానిపాడు యువత ఆదర్శం అని పలువురు వారిని అభినందిస్తున్నారు.

## ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ

**లింగసముద్రం, సెప్టెంబరు 1, ప్రభాతవార్త** మండలంలో ఇరువురు కుటుంబాల మధ్య ఘర్షణ జరగడంతో ఎస్సై ఆవుల వెంకటేశ్వర్లు కేసులు నమోదు చేశారు. ఎస్సై అందించిన వివరాల మేరకు నారసింహపురం గ్రామానికి చెందిన రెండు కుటుంబాలు దారి విషయంలో గొడవపడి ఒకరిపై ఒకరు కర్రలతో దాడి చేసుకున్నారు. దీంతో ఇరువర్గీలపై కేసు నమోదు చేషశారు. అలాగే వీఆర్ కోట పంచాయతీ బ్రహ్మణపల్లి గ్రామానికి చెందిన మాదినేని మాలకొండయ్యను కొందరు దాడి చేసి గాయపరిచినట్లు పిర్యాది ఇచ్చిన రిపోర్టు మేరకు గురువారం కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## ఘనంగా నవరాత్రి ఉత్సవాలు

**లింగసముద్రం, సెప్టెంబరు 1, ప్రభాతవార్త** వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకునేందుకు ప్రజలు సన్నద్ధమయ్యారు. గ్రామగ్రామాన వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసుకుని గణనాధుడికి నిత్య పూజలు జరుపుకుంటున్నారు. మండల కేంద్రమైన లింగసముద్రంతో పాటు పెద్దపవని, చిన్నపవని, అన్నిబోయినపల్లి, మాలకొండరాయినిపాలెం, వీఆర్‌కోట, విశ్వనాధపురం, తిమ్మారెడ్డిపాలెం, మొగలిచర్ల, యర్రారెడ్డిపాలెం, పెంట్రాల పంచాతీల్లో చిన్న పెద్దవి సుమారు 100 వినాయక విగ్రహాలు ఏర్పాటు చేశారు. గ్రామాల్లో కమిటీలు ఏర్పాటు చేసుకుని లంబోదరునికి పూజలువైభవంగా పూజలు జరుగుతున్నాయి.

పోలీసు బందోబస్తు: విగ్రహాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక ఎస్సై ఏ.వెంకటేశ్వర్లు ప్రతి రోజు గ్రామాల్లో బందోబస్తు నిర్వహిస్తున్నారు. కమిటీ వారికి పలు సూచనలు చేశారు. నిమజ్జనం జరుగు సమయాలలో యువకులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా మాలకొండరాయినిపాలెం గణేశుడు:

మాలకొండరాయినిపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయకుడు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. దాదాపు 12 అడుగుల భారీ విగ్రహాన్ని గ్రామస్తులు ఏర్పాటు చేశారు.

## వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమానికి తరలిరండి

**లింగసముద్రం, సెప్టెంబరు 1, ప్రభాతవార్త** నేడు స్వర్గీయ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 12వ వర్ధంతి కార్యక్రమానికి లింగసముద్రం మండలంలోని వైఎస్సార్ అబిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని మండల వైసీపీ అధ్యక్షులు పిచ్చపాటి తిరుపతిరెడ్డి, వైసీపీ మీడియా అధికార ప్రతినిధి వరికూటి కృష్ణారెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు ఎస్‌కే షఫిలు సంయుక్త ప్రకటనలో కోరారు. ముందుగా స్థానిక ఓటయ్య సమాధి వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేయడం జరుగుతుందని తదనంతరం తేనీటి విందు కార్యక్రమం జరుగుతుందన్నారు.

## కార్పొరేట్ వైద్యసేవలను ప్రజలకు అందించడమే ధ్యేయం



**కావలి సెప్టెంబర్ 1 ప్రభాతవార్త** కావలి ప్రాంత ప్రజలకు కార్పొరేట్ వైద్యసేవలను అందించడమే ధ్యేయంగా పెట్టుకుని పనిచేస్తున్నాని డాక్టర్ గుండెమడుగుల దేవదానం మెమోరియల్ వైద్యశాల బాధ్యులు, కావలి మాజీ మున్సిపల్ ఛైర్మన్, ప్రముఖ సర్జన్ యన్ ప్రభాకర్ నాయుడు తెలిపారు. డాక్టర్ నాయుడు సతీమణి స్వర్గీయ నీలిశెట్టి లక్ష్మి గంగాధరమ్మ 12వ వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 6వ తేదీ చెన్నయ్ గ్లోబల్ హెల్త్ సిటి సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉచిత మెగా లివర్ స్క్రీనింగ్ సూపర్ స్పెషాలిటి వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎంతో ఖరీదైన అధునాతన లివర్ అల్ట్రాసౌండ్ స్కానింగ్ ద్వారా ఉచితంగా పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ మెగా వైద్య శిబిరంలో లివర్ మార్పిడి నిపుణులు డాక్టర్ పివి రజనీకాంత్, డాక్టర్ యంఎన్‌వి నీలేంద్ర యశస్విలు పాల్గొంటారని తెలిపారు. డాక్టర్ గుండెమడుగుల దేవదానం మెమోరియల్ వైద్యశాల వైద్యులు డాక్టర్ యం లక్ష్మి శాలిని, డాక్టర్ పి సుధీర్ కుమార్, డాక్టర్ సిహెచ్‌చ్ వినోద్ వినయ్ బాబులు పల్గొని వైద్యసేవలు అందిస్తారన్నారు. ఈ సమావేశంలో గ్లోబల్ హెల్త్‌సిటి మార్కెటింగ్ మేనేజర్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ ప్రభాకర్ నాయుడు ఇప్పటివరకు లక్షకు పైగా ఆపరేషన్లు చేయడం ఎంతైనా అభినందనీయమన్నారు. కావలి ప్రాంత ప్రజలకు ఈ మెగా ఉచిత శిబిరంలో పాల్గొని వైద్యసేవలు పొందాలని కోరారు.



కొలువైన గణనాథులు

